
సాక్షి
తూర్పుగోదావరి

బుధవారం । 4 । జనవరి । 2023



శ్రీవారికి వెండి కటారి

దేవరపల్లి: దేవరపల్లిలోని వేంకటేశ్వరస్వామికి గ్రామానికి చెందిన సుతాపల్లి అప్పారావు, సుబ్బలక్ష్మి దంపతులు రూ.1 లక్ష విలువ గల వెండి కటారిని మంగళవారం ఆలయం కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావుకు అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి మంగళవారం తూర్పు డెల్టాకు 2,900, మధ్య డెల్టాకు 2,100, పశ్చిమ డెల్టాకు 5,050 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.60 అడుగులకు చేరింది.

సుబ్బాలమ్మకు వెండి సమర్పణ



అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ వారికి వెండి మకర తోరణం తయారీ నిమిత్తం కుడుపూడి సీతామహాలక్ష్మి (అమలాపురం) రూ.3.50 లక్షల విలువైన 5 కిలోల వెండిని మంగళవారం సమర్పించారు. ఈ వెండిని సీతా మహాలక్ష్మి, ఆమె కుమారుడు వెంకట తిరుపతిరాజు ఆలయ ప్రతినిధులకు అందజేశారు.



సీఎం జగన్ రోడ్‌షోకు తరలివచ్చిన జనసందోహంలో ఒక భాగం



రాజమహేంద్రవరం నగరంలో సాగుతున్న సీఎం జగన్ రోడ్‌షో

జనమహేంద్రి

- గోదావరి చెంత జన సునామీ
- పుష్కరాలను తలపించిన రాజమహేంద్రవరం
- పింఛన్ వారోత్సవాలకు పోటెత్తిన ప్రజలు
- సీఎం రోడ్ షోకు ఎటుచూసినా జనమే
- రహదారి పొడవునా వినూత్న రీతిలో అఖండ స్వాగతం
- సభా ప్రాంగణంలో ఇసుకేస్తే రాలని పరిస్థితి
- బఫర్ జోన్, కళాశాల బయట కూడా జనసందోహం
- హోరెత్తిన 'జై జగన్' నినాదాలు



సభా వేదికపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులు వేణు, వనిత, ముత్యాలనాయుడు, శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎంపీ మార్గాని భరత్‌రామ్, కలెక్టర్ మాధవీలత, వైఎస్సార్ సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి తీరాన జనసునామీ ఎగసిపడింది. రాజమహేంద్రవరం నగరం జనసమ్మోహనమైంది. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ పింఛను కానుక వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం ఇందుకు వేదికైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంక్షేమ రథసారథి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాజమహేంద్రి కాస్త.. 'జనమహేంద్రి'గా అవతరించి అఖండ స్వాగతం పలికింది. ఎటు చూసినా ఇసుక వేస్తే రాలనంతగా ప్రజా సందోహమే తరలివచ్చింది. వేలాదిగా తరలివచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమానులు, పార్టీ శ్రేణులు, లబ్ధిదారులతో ప్రధాన రహదారులు కిక్కిరిసిపోయాయి. జన విస్ఫోటం చూస్తే.. పవిత్ర గోదావరి పుష్కరాలు జరుగుతున్నాయా అన్న భావన కలిగింది.

జన ఘన స్వాగతం

తాడేపల్లి నుంచి ఉదయం హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం మున్సిపల్ స్టేడియంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం రోడ్‌షో సాగిన ఆర్ట్స్ కాలేజీ వరకూ రోడ్డుకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో జనం బారులు తీరారు. ఆనందంతో పరవళ్లు తొక్కారు. సీఎం వాహనంపై రోడ్డు పొడవునా పూలవాన కురిపించారు. 'జై జగనన్న' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి రోడ్‌షో శ్యామలా థియేటర్ మీదుగా డీలక్స్ సెంటర్, అనుశ్రీ థియేటర్, సోమాలమ్మ సెంటర్, రంభ – ఊర్వశి – మేనక థియేటర్లు, గీతా అప్సరా థియేటర్, చర్చి గేటు మీదుగా ఆజాద్ చౌక్‌కు చేరుకుంది.

అక్కడ భారీ సంఖ్యలో ముస్లింలు సీఎం జగన్‌కు మనసారా స్వాగతం పలికారు. వారికి ఆయన అభివాదం చేస్తూ ముందుకు సాగారు. జాంపేట, నందం గనిరాజు సెంటర్, సెయింట్ లూథరన్ చర్చి, వై జంక్షన్ల వద్ద ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, అభిమానులు 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ప్లకార్డులు పట్టుకుని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

అవ్వా బాగున్నావా?

రోడ్‌షో అనంతరం 11.51 గంటలకు ఆర్ట్స్ కళాశాలలోని సభా వేదిక వద్దకు సీఎం జగన్ చేరుకున్నారు. సంక్షేమ పథకాలకు చెందిన స్టాల్స్ పరిశీలించారు. పింఛను లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న వృద్ధురాలిని 'అవ్వా బాగున్నావా' అంటూ ఆప్యాయంగా పలకరించారు. 'నేనున్నా'నంటూ భరోసా ఇచ్చారు. పింఛను సక్రమంగా అందుతోందా అని ఆరా తీశారు. ఆమె పక్కనే కూర్చొని ఫొటో దిగారు. దీంతో ఒక్కసారిగా భావోద్వేగానికి గురైన ఆ అవ్వ కళ్లు చెమర్చాయి. సీఎం జగన్ ఇస్తున్న భరోసా చూసి అక్కున చేర్చుకుంది. అనంతరం పక్కనే ఉన్న ఓ చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ కె.మాధవీలతను ఆదేశించారు. అనంతరం పింఛను లబ్ధిదారులతో సీఎం జగన్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్, రాజమహేంద్రవరం నగరాభివృద్ధి సంస్థ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ఫొటో దిగారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పెన్షన్ పెంపు వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

కిక్కిరిసిన సభా ప్రాంగణం

ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛను కానుక సభా ప్రాంగణం అశేష జనవాహినితో కిక్కిరిసిపోయింది. సభకు వచ్చిన వారికి ఏర్పాటు చేసిన గ్యాలరీలు నిండిపోయాయి. చివరకు బఫర్ గ్యాలరీ సైతం జనసంద్రమైంది. దీంతో ప్రజలు కళాశాల బయట నిల్చుని మరీ సీఎం ప్రసంగాన్ని విన్నారు. రాజమహేంద్రవరం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం సభకు జనం తరలిరావడం విశేషం.

సీఎంకు ఘన స్వాగతం

రాజమహేంద్రవరం రూరల్/రాజమహేంద్రవరం సిటీ: నగరానికి చేరుకున్న ముఖ్యమంత్రి వై జగన్‌మోహన్‌రెడ్డికి ఆర్ట్స్ కళాశాల మైదానం, మున్సిపల్ స్టేడియంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, తానేటి వనిత, దాడిశెట్టి రాజా, కారుమూరి నాగేశ్వరరావు, పినిపే విశ్వరూప్, జిల్లా పరిషత్ చైర్మన్లు విప్పర్తి వేణుగోపాలరావు, కవురు శ్రీనివాస్, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీలు మార్గాని భరత్‌రామ్, వంగా గీత, చింతా అనురాధ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా, కురసాల కన్నబాబు, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, జిల్లా ఉన్నతాధికారులు ఉన్నారు.

ఆకట్టుకున్న సీఎం ప్రసంగం

పింఛన్ల పెంపు, మంచి చేస్తుంటే టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను వివరిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రసంగం ప్రజలను ఎంతో ఆకట్టుకుంది. ఇచ్చిన హామీ ప్రకారం పింఛను పెంచుతూ పోతున్నామని సీఎం చెప్పగానే ఒక్కసారిగా సభలో 'జై జగన్' నినాదాలు హోరెత్తాయి. అభిమానులు, లబ్ధిదారులు పైకి లేచి ఈలలు, కరతాళధ్వనులతో సీఎంను అభినందించారు. మనసున్న పరిపాలన చేస్తున్నామని చెప్పగానే 'జై జగన్'.. 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ అలుపు లేకుండా నినదించారు. దీంతో సీఎం తన ప్రసంగాన్ని నిమిషం పాటు ఆపేసి నవ్వుతూ ఉండిపోయారు. 'బాబు రావాలంటే బాబు రావాలంటూ' చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్నారని సీఎం చెబుతుంటే.. ప్రజలు 'బాబు వద్దే వద్దు' అంటూ చేతులు ఊపారు. 'చంద్రబాబు విధానం దోచుకో.. దాచుకో' అని, బాబుకు ఎల్లో మీడియా ఉందని.. కానీ మీ బిడ్డ జగన్‌కు దేవుడి దయ, మీ ఆశీస్సులు ఉన్నాయని చెప్పగానే ఆయనను సొంత బిడ్డలా భావించిన లబ్ధిదారులు సభలో భావోద్వేగానికి గురయ్యారు. పేదలకు పెత్తందార్లకు మధ్య యుద్ధం జరుగుతోందని, ప్రజలు గమనించి జాగ్రత్తగా వ్యవహరించాలని సీఎం చెప్పడం పలువురిని ఆలోచింపజేసింది. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని పలువురు కుండబద్దలుగొట్టి మరీ చెప్పారు. ప్రసంగం తర్వాత ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన ఈట్ స్ట్రీట్‌ను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ స్టేడియం వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలతో కొద్దిసేపు మాట్లాడి, తాడేపల్లికి తిరుగుపయనమయ్యారు.



రాజమహేంద్రవరం నుంచే శ్రీకారం



రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు ఒక ప్యాకేజీ స్టార్, ఒక పుష్పరాజ్‌తో కలిసి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారు. కుతంత్ర రాజకీయాల చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు. ముఖ్యమంత్రి స్ఫూర్తి మంత్రం ×వై నాట్ 175×కు రాజమహేంద్రవరం నుంచే శ్రీకారం చుడతాం. ఈ స్థానాన్ని జైగనన్నకు గిఫ్ట్‌గా ఇచ్చేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయి. సోనియాపై గర్జించి, కాంగ్రెస్‌తో విభేదించి ప్రజల కోసం ఒక్కడై పోరాటం చేసిన ధీశాలి జగనన్న. ఆయన పాలనలో ఈ రాష్ట్ర ప్రజలు రామరాజ్యాన్ని చూస్తున్నారు. గత టీడీపీ చంద్రబాబు పాలనలో 39 లక్షల పెన్షన్లు మాత్రమే ఇస్తే, వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఈ మూడున్నరేళ్లలో 68 లక్షల పెన్షన్లు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం మనది. ప్యాకేజీ స్టార్, దత్తపుత్రుడు బూర ఊదితే ఒకసారి బుట్ట నుంచి నుంచి పడగ విప్పి ఆడి.. బూర ఆపగానే మళ్లీ బుట్టలోకి వెళ్లి పడుకుంటాడు.

– మార్గాని భరత్‌రామ్, ఎంపీ, రాజమహేంద్రవరం

'తూర్పు'న 45 వేల కొత్త పింఛన్లు



తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గత మూడేళ్లలో 45 వేల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశాం. గతంలో ప్రతి నెలా 1.93 లక్షల మందికి రూ.244 కోట్లు ఇస్తుంటే ప్రస్తుత ప్రభుత్వంలో 2.38 లక్షల మందికి రూ.789 కోట్లు అందజేస్తున్నాం. కొత్తగా ఏర్పాటైన తూర్పు గోదావరి జిల్లాలో పింఛన్ల పండగ కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉంది. జిల్లా విభజన అనంతరం జిల్లాకు తొలి కలెక్టర్‌గా నన్ను నియమించడం ఎంతో గర్వంగా ఉంది.

– డాక్టర్ కె.మాధవీలత, కలెక్టర్, తూర్పు గోదావరి



అభిమాన ముఖ్యమంత్రి జగన్‌ను కళ్లారా చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన జనం



రోడ్‌షోగా వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన వేళ జనం కేరింతలు

4 జేసీబీలు సీజ్



రెవెన్యూ అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ సూర్యతేజ

పి.గన్నవరం: యర్రంశెట్టివారిపాలెం సరిహద్దున పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన లంకల్లో అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలకు రంగం సిద్ధం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంక పరిధిలోని పట్టా భూముల పరిశీలనకు ఆయన మంగళవారం వెళ్లారు. అక్కడ ఎటువంటి అనుమతులూ లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తవ్వేందుకు బాటలు వేసి, ర్యాంపును సిద్ధం చేయడాన్ని గమనించారు. అక్కడ ఉన్న 4 జేసీబీలను సీజ్ చేశారు. వాటిని తన కార్యాలయానికి తరలించాలని ఆదేశించారు. రాత్రయినప్పటికీ జేసీబీలను తీసుకురాకపోవడంతో ఆయన మళ్లీ పెదమల్లంక వచ్చారు. జేసీబీలను తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ఈ ర్యాంపునకు అనుమతులు లేవన్నారు. రాత్రి వేళల్లో ఇక్కడి నుంచి ట్రాక్టర్లపై ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు గ్రామస్తులు తెలిపారని సబ్ కలెక్టర్ వివరించారు.

భక్తులకు తప్పనున్న గదుల బెడద

- సత్యగిరిపై రెండో సీఆర్వో కార్యాలయం
- హరిహరసదన్ గదులన్నీ అక్కడే చెక్ ఇన్..చెక్ అవుట్
- భవిష్యత్‌లో శివసదన్ సత్రంలోనూ ఇదే పద్ధతి ..
- ఛైర్మన్ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి



రెండో సీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేసిన హరిహరసదన్ సత్రం

అన్నవరం: సత్యదేవుని భక్తులకు సత్రం గదుల ప్రయాస తగ్గనుంది. గదుల రిజర్వేషన్ (సీఆర్వో) కోసం మరో కార్యాలయం ఏర్పాటు చేశారు. హరిహరసదన్‌లోని రెండో సీఆర్వోలో సత్రంలోని 139 గదులకు అక్కడే చెక్ ఇన్, చెక్ అవుట్ పద్ధతి అమలు చేస్తున్నారు. రత్నగిరిపై సత్రాల గదులకు మాత్రమే సీఆర్వో కార్యాలయంలో అద్దెకు ఇస్తారు. రిజర్వేషన్ మాత్రం అన్ని సత్రాలకు రత్నగిరి సీఆర్వోలోనే జరుగుతోంది. ఇప్పటికే ప్రకాష్ సదన్ సత్రంలో గదులు అద్దెకు ఇచ్చి ఖాళీ చేసే విధానం అమలవుతోంది.

ప్రకాష్ సదన్ మినహా అన్నీ కేటాయింపు..

ఈనెల 1 నుంచి సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం (సీఆర్వో) ఏర్పాటు చేసినట్లు దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ప్రస్తుతం ప్రకాష్ సదన్ సత్రం వెనుక సీఆర్వో కార్యాలయం ఉందన్నారు. ప్రకాష్‌సదన్ సత్రం మినహా అన్ని సత్రాలకు ఇక్కడే గదులు కేటాయిస్తున్నారన్నారు. దీని వల్ల సత్యగిరిపై హరిహరసదన్‌లో బస చేసే భక్తులు సీఆర్వో కార్యాలయానికి గది అద్దెకు తీసుకోవడానికి ఒకసారి, ఖాళీ చేసేటపుడు మరో సారి రావల్సి వస్తోందన్నారు. రెండో సీఆర్వో ఏర్పాటు వలన ఈ ఇబ్బంది తప్పుతుందన్నారు. నేరుగా అక్కడికే వెళ్లి గదులు అద్దెకు తీసుకోవడం, ఖాళీ చేసే వెసులుబాటు ఉంటుందన్నారు. హరిహరసదన్‌లో 85 ఏసీ, 51 ఆర్డినరీ, 4 సింగిల్ రూమ్స్ ఉన్నాయన్నారు.

భవిష్యత్‌లో శివసదన్‌లో కూడా...

హరిహర సదన్ సత్రం పక్కన రూ.16 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 138 గదుల శివసదన్ సత్రం కూడా మరో నాలుగు నెలల్లో పూర్తి కానుంది. అప్పుడు శివసదన్ సత్రం గదులు కూడా రెండో సీఆర్వోలోనే అద్దెకు ఇస్తారని తెలిపారు. ఏటా పెరుగుతున్న భక్తులకు వసతి సదుపాయాలు కల్పించేందుకు మరో రెండు సత్రాలు నిర్మించాలని యోచిస్తున్నట్లు చైర్మన్ రోహిత్, ఈఓ సత్యనారాయణ మూర్తి తెలిపారు. సామాన్యుల కోసం 150 గదులతో ఒక సత్రం, ఉన్నత వర్గాల కోసం శివసదన్ సత్రం తరహాలో మరో సత్రం నిర్మించాలని భావిస్తున్నామన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం దశల వారీగా పాత సత్రాలను తొలగించాల్సి ఉందన్నారు. సత్రాలన్నీ సత్యగిరి మీదనే ఉంటాయన్నారు. రత్నగిరిపై కేవలం స్వామివారి ఆలయం, వ్రతాలు, కల్యాణం, అన్నదానం, ప్రసాద తయారీ మాత్రమే ఉంటుందన్నారు. సత్యగిరి, రత్నగిరి జంక్షన్‌లో త్వరలో రెండు సీఆర్వో కార్యాలయాల గురించి వివరిస్తూ డిజిటల్ సైన్ బోర్డులు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు.

ఎస్ఈబీ స్టేషన్ల పునర్విభజన

- నిడదవోలు, దేవరపల్లి, రంగంపేటలో కొత్తగా ఎస్ఈబీ స్టేషన్ల ఏర్పాటు
- కొత్త సంవత్సరం నుంచి కార్యకలాపాలు

కొవ్వూరు: జిల్లాల విభజన నేపథ్యంలో పరిపాలన సౌలభ్యం కోసం స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ల పరిధులను పునర్ వ్యవస్థీకరించింది. కొత్తగా దేవరపల్లి, నిడదవోలు, రంగంపేటల్లో ఎస్ఈబీ పోలీసు స్టేషన్లు ఏర్పాటయ్యాయి. ఈనెల 1 నుంచి కొత్తగా ఏర్పడిన మూడు సెబ్ స్టేషన్ల నుంచి పాలనా వ్యవహారాలు ప్రారంభమయ్యాయి. ఒక స్టేషన్ పరిధి రెండు, మూడు జిల్లా పరిధిలో ఉండడంతో సెబ్‌ను పునర్ వ్యవస్థీకరించాల్సి వచ్చింది. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్టేషన్ల విభజన ప్రక్రియ పూర్తి చేశారు.

కొత్త పరిధులు ఇలా

రాయవరం ఎస్ఈబీ స్టేషన్‌ను ఎత్తివేయడంతో అక్కడి సిబ్బందిని రంగంపేటకి బదిలీ చేశారు.


- దేవరపల్లి స్టేషన్‌కు పోలవరం, భీమడోలు స్టేషన్‌ల నుంచి సిబ్బందిని సర్దుబాటు చేశారు.
- నిడదవోలుకు పెనుగొండ, తణుకు స్టేషన్ల నుంచి సర్దుబాటు చేశారు.
- కొత్తగా ఏర్పడిన మూడు స్టేషన్లకు ఒక సీఐ, ఎస్సైతో పాటు ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లు వంతున నియమించారు.



కొవ్వూరులోని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో స్టేషన్

- రంగంపేటకి మాత్రం ఏడుగురు కానిస్టేబుళ్లను కేటాయించారు.
- రాజమహేంద్రవరం నార్త్‌లో 1 నుంచి 15వ డివిజన్ వరకు, 23, 24తో పాటు 29 నుంచి 50వ డివిజన్ వరకు, కాతేరు, కోలమూరు, కొంతమూరు, రాయుడుపాకలు, తొర్రేడు, వెంకటాపురం ఆరు గ్రామాలుంటాయి.
- రాజమహేంద్రవరం సౌత్ పరిధిలోని అర్బన్‌లో 16 నుంచి 22 వరకు, 25 నుంచి 28వ డివిజన్ వరకు 11 డివిజన్లు చేర్చారు
- రూరల్ పరిధిలోని ధవళేశ్వరం, బొమ్మూరు, రాజోలు, హుకుంపేట, పిండిగొయ్యి, కవలగొయ్యి,శాటిలైట్ సిటీ, కడియం, రాజానగరం మండలాలుంటాయి.
- రాజమహేంద్రవరం నార్త్, సౌత్ ఎస్ఈబీ స్టేషన్ పరిధిని మార్చలేదు. నియోజకవర్గ పరిధి యూనిట్‌గా తీసుకుని కొవ్వూరు,నిడదవోలు ఎస్ఈబీ స్టేషన్ పనిచేయనున్నాయి.
- కోరుకొండలో సీతానగరం, గోకవరం, కోరుకొండ మండలాలు, రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలు ఉండేలా మార్చారు.
- దేవరపల్లి,గోపాలపురం,నల్లజర్ల మండలాలను కలిపి దేవరపల్లి ఎస్ఈబీ స్టేషన్ ఏర్పాటు చేశారు.
- ఉండ్రాజవరం,పెరవలి,నిడదవోలు మండలాలను కలిపి నిడదవోలులో ఎస్ఈబీ స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు.

పునర్విభజన ప్రక్రియ పూర్తి



జిల్లా పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఎస్ఈబీ స్టేషన్ పరిధి పునర్విభజనం ప్రక్రియ పూర్తి చేశాం.ఇక మీదట కొత్తగా ఏర్పడిన దేవరపల్లి, నిడదవోలు, రంగంపేట ఎస్ఈబీ స్టేషన్‌లలో కేసుల నమోదు, దర్యాప్తు అన్నీ ఈ స్టేషన్‌లు కేంద్రంగానే కొనసాగుతాయి.ఇప్పటికే ఈ కొత్త స్టేషన్‌ల పరిధిలోకి వచ్చే కేసులన్నీ ఇక్కడి బదిలీ చేశాం.

– పి.సోమశేఖర్, అడిషనల్ ఎస్పీ, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో


వచ్చాడయ్యో సామీ.. : సీఎం జగన్‌ను చూసేందుకు జనం ఆత్రుత


జన కోలాహలం: జాంపేట ఆజాద్‌చౌక్‌లో..


జనసంద్రం: ఆర్ట్స్ కళాశాలలోని సభాప్రాంగణం వెలుపల రోడ్డుపై జనసందోహంలో ఒక భాగం

వెల్లువెత్తిన గోదారిలా..

తమ ప్రియనేత, ప్రజాసంక్షేమ సారథి.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగమించిన వేళ.. వరదల వేళ ఇరు తీరాలనూ ఒరుసుకుంటూ వెల్లువెత్తిన గోదారిలా.. రాజమహేంద్రవరంలో జనవాహిని ఉవ్వెత్తున ఉరకలెత్తింది. బహిరంగ సభలోనే కాదు.. ఏ రోడ్డు చూసినా జనమే జనం.. చివరకు సభాప్రాంగణానికి వెలుపల కూడా రోడ్డు జనసంద్రాన్ని తలపించింది. మున్సిపల్ స్టేడియం నుంచి ఆర్ట్స్ కళాశాల మైదానం వరకూ రోడ్‌షోగా వచ్చిన సీఎం జగన్ వాహనంపై.. వేలాదిగా బారులు తీరిన ప్రజలు పూలవాన కురిపించారు. ఆ అభిమాన వర్షంలో తడిసి ముద్దయిన ముఖ్యమంత్రి.. వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఆయన ప్రసంగాన్ని శ్రద్ధగా విన్న జనం.. రెట్టించిన ఉత్సాహంతో కేరింతలు కొట్టారు.

– సాక్షి నెట్‌వర్క్


కిటకిట: జనంతో కిక్కిరిసిన శ్యామలా సెంటర్


ఫలాలనిస్తోంది.. మీ సంక్షేమ వృక్షం: సీఎం జగన్‌కు 'సంక్షేమ ఫలాల చెట్టు' రూపంలో ఉన్న జ్ఞాపిక అందజేస్తున్న తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత. చిత్రంలో మంత్రులు విశ్వరూప్, వేణు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు


అందుకోండీ చిరు సత్కారం: సీఎం జగన్‌కు ఎంపీలు వంగా గీత, చింతా అనురాధ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ తదితరుల సన్మానం


తాతా.. కుశలమా..


ముఖ్యమంత్రికి ఎంపీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ జ్ఞాపిక


అదిగదిగో మన మామయ్య..



అన్న వచ్చిన వేళ.. నింగి వీధుల నుంచి అభిమానుల పూలజల్లులు

ఇది కదా.. మానవీయ పాలన

'ఆ మహారాజు తన దేశ ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునేవాడు' అంటూ చిన్నప్పుడు చందమామ కథల్లో చదవడమే తప్ప.. ప్రత్యక్షంగా చూసిన వారు దాదాపు ఉండరంటే అతిశయోక్తి కానేకాదు. అటువంటి పాలకుడిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలో ఇప్పుడు చూస్తున్నామంటూ ఆ తల్లిదండ్రులు.. కృతజ్ఞత నిండిన గుండెలతో.. చెమర్చుతున్న కళ్లతో చెబుతున్నారు. ప్రజలను ప్రభువు.. కన్నబిడ్డల్లా చూసుకోవాలనే మాటకు నిండైన అర్థం సీఎం జగనేనని.. తమ బిడ్డ ఈ రోజు ఊపిరి తీసుకుంటోందంటే అది ఆయన మానవీయ పాలన చలవేనని భావోద్వేగానికి గురవుతున్నారు.

- గాకర్స్ బాధిత చిన్నారి హనీకి రూ.10 వేల పెన్షన్
- జీవితాంతం అందించనున్న ప్రభుత్వం
- సీఎం జగన్ ఆదేశాలతో ప్రత్యేక కేసుగా పరిగణన
- ఇప్పటికే వైద్య ఖర్చులకు రూ.కోటి కేటాయింపు
- పూర్తి ఉచిత విద్యకు కలెక్టర్ ఏర్పాట్లు
- తమ బిడ్డకు సీఎం ఊపిరి అందిస్తున్నారంటూ తల్లిదండ్రుల కృతజ్ఞతలు


కోనసీమ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వచ్చిన సీఎం జగన్‌తో బాధిత హనీ, తండ్రి రాంబాబు (ఫైల్)

అమలాపురం టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం నక్కా రామేశ్వరం గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి కొప్పాడి హనీ అరుదైన గాకర్స్ వ్యాధితో బాధ పడుతున్న విషయం తెలిసిందే. ఆమె పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఔదార్యం చూపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ను మంజూరు చేయించారు. ఇక నుంచి హనీకి ప్రతి నెలా రూ.10 వేల పెన్షన్ జీవితాంతం అందించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకు నిబంధనలు వర్తించపోయినప్పటికీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ చిన్నారిని ప్రత్యేక కేసుగా పరిగణించి, ఉన్నతాధికారులు సోమవారం పెన్షన్ మంజూరు చేశారు. అలాగే హనీకి నాణ్యమైన విద్యను ప్రభుత్వమే పూర్తిగా అందించేందుకు కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యతో పాటు ఉన్నత చదువులు పూర్తయ్యే వరకూ ఆమెకు ఉచిత విద్య అందించనున్నారు. హనీ పెన్షన్, ఉచిత విద్య ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నేరుగా పర్యవేక్షిస్తున్నారు. ఈ నెల నుంచే హనీకి పెన్షన్ అందించడంతో పాటు అమలాపురంలోని ఓ విద్యాలయంలో ఉచిత విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నారు.

కష్టానికి చలించి.. మానవత్వంతో స్పందించి..

హనీ రెండున్నరేళ్ల ప్రాయంలోనే కాలేయానికి సంబంధించిన అరుదైన గాకర్స్ వ్యాధి బారిన పడింది. రెక్కాడితేనే కానీ డొక్కాడని ఆమె తల్లిదండ్రులు రాంబాబు, నాగలక్ష్మి తమ బిడ్డను ఎన్నో కార్పొరేట్ ఆస్పత్రుల్లో చూపించారు. చివరకు గత ఏడాది జూలై 26న కోనసీమ వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని రాంబాబు తన కుమార్తెను తీసుకుని కలిశాడు. ఆమె ప్రాణాన్ని కాపాడాలని వేడుకున్నారు. ఆ చిన్నారి పరిస్థితి తెలుసుకుని చలించిపోయిన ముఖ్యమంత్రి జగన్.. ఆమె వైద్యానికి ఏర్పాట్లు చేయాలని అక్కడే ఉన్న కలెక్టర్ హిమాన్షు శుక్లాను ఆదేశించడం, అందుకు రూ.కోటి కేటాయించడం వంటి పరిణామాలు విదితమే. హనీకి రెండు వారాలకోసారి చేయాల్సిన అరుదైన సెరిజైమ్ ఇంజక్షన్ ఖరీదు రూ.1.25 లక్షలు కాగా అమెరికా నుంచి రాయితీపై రూ.74 వేలకే రప్పించారు. ప్రతి ఆరు నెలలకు సరిపడేలా రూ.10 లక్షల వ్యయంతో 13 ఇంజక్షన్లను కలెక్టర్ శుక్లా రప్పించి అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ద్వారా ఉచిత వైద్యం అందిస్తున్నారు. ఈ ఇంజక్షన్లు జీవితాంతం చేస్తేనే హనీ బతుకుతుందని తెలుసుకున్న సీఎం జగన్ మానవతా దృక్పథంతో స్పందించి ఇన్ని ఏర్పాట్లు చేశారు.

మా పాప ఊపిరి.. సీఎం జగన్ పుణ్యమే..

హనీ ఈ రోజు ప్రాణాలతో ఉందంటే అది ముఖ్యమంత్రి జగన్ పుణ్యమే. ఈ నెల 11న హనీ పుట్టిన రోజు సందర్భంగా ఏదో ఒక విధంగా సీఎం జగన్ గారిని కలిసేందుకు అపాయింట్‌మెంట్ ఇప్పించాలని ఉన్నతాధికారులను అభ్యర్థించాను. దేవుడి లాంటి జగన్‌ను స్వయంగా కలిసి, కృతజ్ఞతలు చెప్పాలన్నది మా కుటుంబం తపన.

– నాగలక్ష్మి, రాంబాబు, హనీ తల్లిదండ్రులు

విఘ్నేశ్వరుని సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు జడ్జి



అయినవిల్లి: ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వి.కామేశ్వరరావు అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ప్రధానార్చకుడు వినాయకరావు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామికి న్యాయమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పండితులు ఆశీర్వదించి, శేషవస్త్రాలతో సత్కరించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

బాల్ బ్యాడ్మింటన్ 'నన్నయ' జట్టు ఎంపిక


నన్నయ వర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ జట్టు

అనపర్తి: ఇంటర్ యూనివర్సిటీ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఆదికవి నన్నయ యూనివర్సిటీ పురుషుల జట్టు ఎంపిక స్థానిక జీబీఆర్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఎంపికల్లో ప్రతిభ చూపిన 13 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్టు జీబీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌పీ అబ్బాయిరెడ్డి తెలిపారు. అనపర్తిలో వారం రోజుల శిక్షణ అనంతరం వీరు ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకూ కర్ణాటక రాష్ట్రం మంగళూరులో జరిగే ఇంటర్ వర్సిటీ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే..

తోట నవీన్, నూతిక వీర మనోహర్, మద్రె సాయిరాం, శీలం శివరాకేష్ (జీబీఆర్, అనపర్తి), బి.స్వామి, చిన్నంరెడ్డి రాజు (శ్రీప్రజ్ఞ, బిక్కవోలు), కమిడి మహేష్‌బాబు, తుమ్మల రామాంజనేయులు (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ, గోపన్నపాలెం), కె.ఆనంద్‌పాల్ (డీఆర్‌జీ, తాడేపల్లిగూడెం), దొడ్డి రాజేష్ (ఏబీఎన్ కళాశాల, కొవ్వూరు), స్టాండ్‌బైగా ఎం.నాగేంద్ర (ఏకేఎన్ యూనివర్సిటీ), జి.దుర్గాప్రసాద్ (డీఆర్‌కే రెడ్డి, జి.మామిడాడ), ఎస్.వెంకటరమణ (ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ).

ఇంటర్ కాలేజియేట్ పోటీల విజేత జీబీఆర్

నన్నయ వర్సిటీ ఇంటర్ కాలేజియేట్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ పురుషుల విభాగం విజేతగా అనపర్తి జీబీఆర్ డిగ్రీ కళాశాల జట్టు నిలిచింది. ఈ నెల 2, 3 తేదీల్లో జీబీఆర్ విద్యాసంస్థల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరిగాయి. జీబీఆర్ (అనపర్తి), శ్రీప్రజ్ఞ (బిక్కవోలు), ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ (గోపన్నపాలెం), వీఎస్ఎం (రామచంద్రపురం), డీఆర్‌జీ (తాడేపల్లిగూడెం), వీఎస్‌కే (భీమవరం), డీఆర్‌కే రెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల(జి.మామిడాడ)లకు చెందిన సుమారు 80 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరయ్యారు. శ్రీప్రజ్ఞ కళాశాల జట్టు రన్నర్‌గా, ఎస్ఎస్ఆర్‌జీసీపీఈ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. వారికి జీబీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డీన్ హరిప్రసాద్, కె.హరినాథరెడ్డి ట్రోఫీలు అందజేశారు.